జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 29-4-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 322 పేజీలు: 4 వెల : రూ.7




# అటు సీనియర్.. ఇటు జూనియర్!



**-పార్టీ విధేయులకే పెద్దపీట**
**-సామాజిక సమతూకంతో తూర్పు కాపులు, కాళింగులకు న్యాయం**
**-డీసీసీబీ చైర్మన్‌గా శివ్వాల సూర్యనారాయణ**
**-డీసీఎంఎస్ పీఠంపై చౌదరి అవినాష్**
**-ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**
**-టీడీపీ శ్రేణుల హర్షాతిరేకాలు**




**(శ్రీకాకుళం/సరుబుజ్జిలి)**

అధికారంలోకి వచ్చిన 11 నెలల అనంతరం కూటమి ప్రభుత్వం జిల్లాలో ప్రధాన పదవులను భర్తీ చేసింది. జిల్లాలోని రెండు ప్రధాన సామాజికవర్గాలకు చెరొక పదవి కట్టబెట్టి, సామాజిక సమతూకం పాటించింది. ఈ పదవుల భర్తీలో పార్టీపై విధేయతకే పెద్దపీట వేసింది. ఓ సీనియర్ నాయకుడికి, ఓ యువ నేతకు ఈ పదవుల కట్టబెట్టడం ద్వారా సీనియర్లతో పాటు యువకులు కూడా పార్టీకి అవసరమని చాటి చెప్పింది. ఈ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఎటువంటి అధికార పదవి లభించని ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు చెందిన నాయకులకు ఈ పదవులను కట్టబెట్టింది. జిల్లాలో కీలకమైన డీసీసీబీ చైర్మన్ పదవికి సరుబుజ్జిలి మండలం షళంత్రి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, తూర్పుకాపు సామాజిక వర్గానికి చెందిన శివ్వాల సూర్యనారాయణ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన షళంత్రి ఎంపీటీసీ సభ్యులుగా ఉన్నారు. ఈయన గతంలో సరుబుజ్జిలి జడ్పీటీసీ సభ్యుడిగా ఐదేళ్లు పనిచేశారు. షళంత్రి పంచాయతీ సర్పంచ్‌గా దశాబ్దాల రాజకీయ అనుభవాన్ని కలిగి ఉన్నారు. పార్టీని ఆదినుంచి నమ్ముకుని ఉన్నారు. దశాబ్దాలుగా పార్టీలోనే కొనసాగుతూ ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా పార్టీ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయనకు ఈ పదవి వరించడంపై పార్టీ నేతలు, కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శివ్వాల సూర్యనారాయణకు పదవి ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద ఓటు బ్యాంకుగా నిలిచిన తూర్పుకాపు సామాజిక వర్గాన్ని తెలుగుదేశం గుర్తించిందనే భావన కలగడంతోపాటు, ఆయన నియామకం పార్టీకి మరింత బలం చేకూర్చుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా శివ్వాల మాట్లాడుతూ జిల్లాలో సహకార బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇక జిల్లాలో నామినేటెడ్ పదవుల్లో రెండోది అయిన డీసీఎంఎస్ చైర్మన్ గిరి యువ నాయకుడు చౌదరి అవినాష్‌కు దక్కింది. ఈ మేరకు ఆయనను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అవినాష్ జిల్లాలోని అతి పెద్ద కళింగ సామాజికవర్గానికి చెందిన వారు. బలమైన రాజకీయ కుటుంబానికి చెందిన వారు. ఈయన తండ్రి చౌదరి నారాయణమూర్తి(బాబ్జీ) తెలుగుదేశం ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. ఎచ్చెర్ల నియోజవర్గంలో టీడీపీకి బలమైన నేత. ఎస్ఎం పురం సర్పంచ్‌గా దశాబ్దాల పాటు సేవలందించారు. ఎచ్చెర్ల జడ్పీటీసీ సభ్యుడిగా, జడ్పీ వైస్ చైర్మన్‌గా ఒక పర్యాయం పనిచేశారు. అలాగే అవినాష్ తల్లి చౌదరి ధనలక్ష్మి ఎచ్చెర్ల జడ్పీటీసీ సభ్యురాలిగా, జడ్పీ చైర్మన్‌గా 2014 నుంచి 19వరకు సేవలందించారు. అవినాష్ కూడా షేర్ మహమ్మద్ పురం పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. టీడీపీ యువజన విభాగంలో దశాబ్ద కాలంగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. సిక్కోలు పార్లమెంట్ పరిధిలో అత్యధిక ఓటు బ్యాంకు కలిగి ఉన్న కాళింగ సామాజిక వర్గానికి చెందిన అవినాష్ నియామకం ద్వారా తెలుగుదేశం పార్టీ వారికి పెద్దపీట వేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీని గ్రామీణ స్థాయిలో మరింత బలోపేతం చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# నందమూరి నాయకా.. అందుకోరా కానుక



**-బాలకృష్ణకు పద్మభూషణ్ అందించిన రాష్ట్రపతి ముర్ము -శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు లోకేష్, అచ్చెన్న**



**అమరావతి, ఏప్రిల్ 28(వార్త):** ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పద్మభూషణ్ పురస్కారం సోమవారం అందించారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో పద్మ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ ఉత్సవానికి బాలకృష్ణ పంచెకట్టుతో హాజరై, తెలుగు వారి సంప్రదాయ వస్త్రధారణకు ప్రతీకగా నిలిచారు. పంచెకట్టులో నందమూరి అందగాడు అనిపించారు. ఆయన అవార్డు అందుకోవడంపై రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

"నాకెంతో ఆప్తులు, సోదర సమానులు, కళామ్మ తల్లి ముద్దు బిడ్డ, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఈరోజు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అత్యుత్తమ పురస్కారం "పద్మభూషణ్" అవార్డును అందుకోవడం నాకెంతో సంతోషాన్నిచ్చింది. వారికి నా శుభాకాంక్షలు" అని నారా లోకేష్ ట్వీట్ చేశారు.

"దివంగత నందమూరి తారక రామారావు వారసుడిగా తెలుగు సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టిన బాలకృష్ణ 100కి పైగా సినిమాలలో నటించి తెలుగు సినిమా రంగంలో తనదైన ముద్ర వేస్తూ, తల్లి బసవతారకం స్మారకంగా స్థాపించిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ అటు సినీ రంగానికి, ఇటు ప్రజా సేవలో తనదైన శైలిలో తన వంతు సహాయం అందిస్తున్నారు. వారికి నా కృతజ్ఞతలు. వారు ఇంకా ఎన్నో విజయాలు చవిచూడాలని, మరెంతో ఎత్తుకు ఎదగాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటున్నాను" అని లోకేష్ పేర్కొన్నారు.

అచ్చెన్నాయుడు కూడా బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. "సినీ రంగంలోనే కాకుండా ప్రజా సేవలోనూ బాలకృష్ణ విశిష్టమైన కృషి చేస్తున్నారు. ఆయనకు పద్మభూషణ్ పురస్కారం రావడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణం" అన్నారు.

## 30 లోగా రిటర్న్‌లు దాఖలు చేయాలి



**శ్రీకాకుళం, ఏప్రిల్ 28(వార్త):** శ్రీకాకుళం జిల్లాలో ఫ్యాక్టరీల చట్టం, 1948 ప్రకారం రిజిస్టర్ అయిన రైస్ మిల్లులు, జీడిపిక్కల కర్మాగారాలు, గ్రానైట్ కర్మాగారాలు, స్టోన్ క్రషర్‌లు, షా మిల్లులు (కర్రల మిల్లులు) మరియు ఇతర పెద్ద కర్మాగారాలన్నియు ఇంటిగ్రేటెడ్ యాన్యువల్ రిటర్న్‌లను 2025 ఏప్రిల్ 30వ తేదీలోగా సింగిల్ డెస్క్ పోర్టల్ (%ఖుజూఅఅ-ఎబరతీఅవం.స్త్రశీజ.అఅ%) ద్వారా ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా సమర్పించాలని కర్మాగారముల ఉపముఖ్యతనిఖీ అధికారి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

# పీఆర్ ఇంజనీర్ల ఖాళీలు భర్తీ చేయాలి

**-ప్రభుత్వానికి రాష్ట్రస్థాయిపంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ వినతి**




**శ్రీకాకుళం, ఏప్రిల్ 28(వార్త):** రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని 2014-19 సంవత్సరాల మధ్య పెండింగ్ లో ఉన్న పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో ఇంజనీర్లు పై గతంలో పెట్టిన కేసులు రద్దు చేయాలని కోరుతూ ఆదివారం శ్రీకాకుళం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ సమావేశంలో కోరారు. శ్రీకాకుళం జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు సనపల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 26 జిల్లాల పరిధిలో ఉన్న ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం గౌరవ అధ్యక్షులు వి వి మురళీ కృష్ణ నాయుడు ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.2014-19 మధ్య నాటి టీడీపీ అధికారంలో ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల కిలోమీటర్ల పొడవున పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం రోడ్లు వేయగా దేశానికి ఆంధ్ర ప్రదేశ్ మొదటి స్థానం సంపాదించింది అని గుర్తు చేశారు. గ్రామీణాభివృద్ధిలో పి ఆర్ ఇంజనీర్ల పాత్ర అమోఘమని కొనియాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లె పండగ పేరుతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున రహదారులు నిర్మాణానికి శ్రీకారం చుట్టగా వాటిని సకాలంలో పూర్తి చేసి ప్రభుత్వానికి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చిన ఘనత పి ఆర్ ఇంజనీర్లదేనని అన్నారు. మూడు దశాబ్దాలుగా రిక్రూట్మెంట్ లేక చాలీ చాలని సిబ్బందితో పనులు చేస్తున్నామని. వెంటనే ఆంధ్ర ప్రదేశ్ సర్వీస్ కమిషన్ ద్వారా అసిస్టెంట్ ఇంజనీర్ ల రిక్రూట్మెంట్ జరపాలని ఆయన కోరారు. రాజకీయ కోణంలో వైసీపీ ప్రభుత్వం 2019-24 మధ్య రాష్ట్రంలో అనేక మందిపై తప్పుడు కేసులు బనాయించిదని వీటిని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు %ఖ%. సంగీతరావు.. బి. శ్రీనివాస్.. వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై గొడ్డలితో దాడి




**సంతబొమ్మాళి, ఏప్రిల్ 28(వార్త):** నౌపడ గ్రామానికి చెందిన దుక్క సంతోష్ కుమార్‌పై అదే గ్రామానికి చెందిన జీరు శంకర్ రెడ్డి గొడ్డలితో రాత్రి తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దుక్క రమేష్ స్నానం చేస్తుండగా ఆ నీరు.. జీరు శంకర్ రెడ్డి ఇల్లు ముందుకు వెళ్లడంతో గొడవ జరిగింది. ఇరువురి మధ్య వాగ్వివాదం జరుగుతున్న సమయంలో రమేష్ అన్న కుమారుడు సంతోష్ కుమార్ వచ్చి ఇరువురికి నచ్చజెప్పి ప్రయత్నం చేశాడు. మద్యం మత్తులో ఉన్న శంకర్ రెడ్డి తన ఇంట్లో ఉన్న గొడ్డలిని తెచ్చి సంతోష్ కుమార్ తలపై దాడి చేయగా తీవ్ర గాయమైంది. గాయపడిన సంతోష్ కుమార్ ను నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నౌపడ పోలీసులు తెలిపారు. దాడికి పాల్పడిన శంకర్ రెడ్డి పరారయ్యారు.

## వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం



**మెళియాపుట్టి, ఏప్రిల్ 28(వార్త):** మెళియాపుట్టిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయని శాఖా గ్రంథాలయధికారిని ఆర్. అనురాధ తెలిపారు. సోమవారం నాడు శాఖగ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయని ఏప్రిల్ 28 మొదలుకొని మే 6 తేదీ వరకు జరగనున్నాయని తెలియజేస్తూనే ఈ వేసవి శిక్షణ తరగతుల కాలంలో పిల్లలకు, విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తకం పఠనం, డ్రాయింగ్, క్రాఫ్ట్, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర విషయాల పై పిల్లలకు అవగాహన పరచడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు పుస్తక పఠనం చేపట్టారు. ఈ వేసవి శిక్షణ తరగతులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

# అసిస్టెంట్ కలెక్టర్‌గా పృథ్వీ రాజ్‌కుమార్



**శ్రీకాకుళం, ఏప్రిల్ 28(వార్త):** జిల్లాకు శిక్షణలో ఉన్న కొత్త అసిస్టెంట్ కలెక్టర్‌గా దొనక పృథ్వీ రాజ్ కుమార్ ఐఏఎస్ నియమితులయ్యారు. సోమవారం ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. 2025 ఏప్రిల్ 28 నుంచి 2026 ఏప్రిల్ 24 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. 2002లో జన్మించిన పృథ్వీ రాజ్ కుమార్ వయస్సు 23 సంవత్సరాలు. 2024 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. మన్యం జిల్లా పార్వతీపురంకు చెందిన ఆయన తండ్రి విజయకుమార్ మండల విద్యాధికారి (ఎంఈఓ)గా, తల్లి వెంకటరత్నం గృహిణిగా ఉన్నారు. సోదరి పూజిత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. పృథ్వీ రాజ్ కుమార్ ప్రాథమిక విద్య నుంచి పదవ తరగతి వరకు పార్వతీపురంలోనే అభ్యసించారు. ఇంటర్మీడియట్ విద్యను నారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జియాలజీ సబ్జెక్టులతో డిగ్రీ పట్టా అందుకున్నారు. అనంతరం ఇగ్నో యూనివర్సిటీ, ఢిల్లీ ద్వారా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ సాధించారు. విద్యాభ్యాస దశ నుంచే పౌర సేవలపై ఆసక్తి పెంచుకున్న ఆయన, అదే లక్ష్యంగా ముందుకుసాగి సివిల్ సర్వీసెస్‌లో విజయ సాధించారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో పరిపాలనా వ్యవహారాల్లో అనుభవం సేకరించేందుకు శిక్షణ పొందుతున్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ సేవలందించడమే తన లక్ష్యమని పృథ్వీ రాజ్ కుమార్ తెలిపారు.

## ఎస్పీ గ్రీవెన్స్‌కు 58 వినతులు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 28(వార్త):** జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో 58 పిర్యాదులు అందాయి. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల స్వీకరణ,నమోదు మరియు పరిష్కార కార్యక్రమంలో ప్రజల నుంచి 58 పిర్యాదులు అందినాయి.

# పలాసలో కేంద్రీయ విద్యాలయం

**- స్థలాన్ని పరిశీలించిన కేంద్రీయ విద్యాలయ అసిస్టెంట్ కమిషనర్ మంజునాథ్**



**పలాస, ఏప్రిల్ 28(వార్త):** పలాసలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణ స్థలాన్ని సోమవారం కేంద్రీయ విద్యాలయ అసిస్టెంట్ కమిషనర్ మంజునాథ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సూది కొండకు ఆనుకొని ఉన్న ఈ స్థలం కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి అనువుగా ఉందని తెలిపారు. 2025 -26 సంవత్సరంలో తరగతులు ప్రారంభించేందుకు అనుగా ఉన్న రైల్వే పాఠశాల భవనాలను పరిశీలించారు. కేంద్ర క్యాబినెట్లో ఆమోదం పొందిన వెంటనే పలాసలో తరగతులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఆర్డీఓ జి వెంకటేష్, ఎమ్మార్వో పి కళ్యాణ్ చక్రవర్తి, ఏపీ టిపిసి చైర్మన్ వజ్జ బాబురావు, పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, జిల్లా పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి విఠల్ రావు, పలాస పట్టణ టిడిపి అధ్యక్షులు నాగరాజు, పలాస పట్టణ టిడిపి కార్యదర్శి నవీన్, అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ లక్ష్మణరావు, బిసి సెల్ అధ్యక్షులు కామేష్, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, జోగ మల్లి, రవిశంకర్ గుప్తా, మల్లిపెద్ది చిన్ని, అనిల్ శర్మ, తమ్మినేని గంగరావు,కొండె నర్సింహులు , దడియాల నరసింహులు, కూటమినేతలు జనసేన జిల్లా కార్యదర్శి సంతోష్ పండా, పలాస బిజెపి కన్వీనర్ రామానంద స్వామి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య ఎక్కడ ఉన్నా..
## నేరుగా సంప్రదించండి

**-పలాస మున్సిపల్ కమిషనర్ రామారావు**

**పలాస, ఏప్రిల్ 28 (వార్త) :** ఏప్రాంతములో అయిన మంచినీటి సమస్య ఎక్కడ ఉన్నా నేరుగా తనని సంప్రదించ వచ్చునని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కార్యక్రమంను పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సోమవారం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో త్రాగునీటి కొరకు, జనన మరణ సర్టిఫికెట్లు కొరకు, వితంతు పెన్షన్లు మరియు ఆస్తి పన్ను పేరు మార్పు కొరకు పలు సమస్యలపై మొత్తం 10 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. ఈ పురపాలక సంఘంలో మంచినీటి సమస్య ఎక్కడైనా ఉన్న తనను నేరుగా సంప్రదించవచ్చునని కమిషనర్ తెలియజేశారు. జనన మరణ సర్టిఫికెట్ల కొరకు 6, వితంతు పెన్షన్ కొరకు -1, త్రాగునీటి సరఫరా కొరకు-2, ఆస్తి పన్ను పేరు మార్పు కొరకు - 1 దరఖాస్తులు అందినట్లు తెలియజేసారు.




# హరిపురం లయన్స్ క్లబ్ కోస్టల్ దాతృత్వం




**మందస, ఏప్రిల్ 28(వార్త):** మందస మండలంలోని హరిపురంలో గల హరిపురం లయన్స్ క్లబ్ కోస్టల్ దాతృత్వం చూపింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ లయన్స్ క్లబ్ ముందుంటుంది. ప్రజాహిత కార్యక్రమాలతో పాటు దాతృత్వం, ఉదారత కార్యక్రమాలతో లయన్స్ క్లబ్ ఎంతో గుర్తింపు తెచ్చుకుంది. దీనిలో భాగంగా స్థానిక ఎస్సీ వీధిలో గల పేదలకు చీరలను క్లబ్ ప్రతినిధులు పంచిపెట్టారు. లయన్స్ క్లబ్ దాతృత్వానికి చీరలు అందుకున్న మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హరిపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు భైరిశెట్టి గున్నయ్య, కార్యదర్శి ఎరుకోల సత్యన్నారాయణమూర్తి, కోశాధికారి మండెల్లి లక్ష్మణరావు, కొర్ల కన్నారావు, జన్ని రాము, బాలకృష్ణ, రట్టి పాపారావు, కొంచాడ హేమశేఖర్, పుల్లా వాసుదేవు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

**పలాస, ఏప్రిల్ 28(వార్త):** ఏపీపీటీడీలో దీర్ఘకాలికంగా నెలకొని ఉన్న సమస్యలపై యాజమాన్యం ఉద్యోగుల పట్ల వ్యవరిస్తున్న వ్యతిరేక ధోరణికి నిరసనగా రాష్ట్రంలోని 129 డిపోలలో, నాన్ ఆపరేషన్ యూనిట్లలో సిబ్బంది డిమాండ్స్ తోకుడిన ప్లే కార్డుల ప్రదర్శనతో నిరసన తెలిపారు. నిరసనతెలుపుతున్న నేపథ్యంలో సోమవారం పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన నిరసన శిబిరాన్ని నేషనల్ మజ్దార్ యూనియన్ జోనల్ కార్యదర్శి డిఎల్ రావు సందర్శించారు. నిరసనకు సంఘీభావం తెలిపిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ యూనియన్ డిమాండ్లు తీర్చాలని విజ్ఞప్తి చేశారు.





## వేసవిలో విద్యార్థులకు విజ్ఞానం

**మందస, ఏప్రిల్ 28(వార్త):** వేసవికాలంలో విద్యార్థులకు విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని మందస పట్టణంలోని గ్రంథాలయం లైబ్రేరియన్ జె. విజయలక్ష్మి పిలుపునిచ్చారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రారంభించిన అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ వేసవికాలంలో విద్యార్థులకు సెలవులు వస్తుంటాయని, సెలవుల సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలకు వేసవిలో గ్రంథాలయంనకు రారండోయ్ అనే ఈ కార్యక్రమాన్ని విజ్ఞానం, వినోదం, వికాసం కోసమే నిర్వహిస్తున్నామన్నారు. మాట్లాడుతూ మందస పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమయ్యింది. బడులకు సెలవులతో పరీక్షలుండవని.. గ్రంథాయలంలో అన్ని ఆటలు, పాటలు, కథలు, కబుర్లుంటాయన్నారు. చిత్రలేఖనం, వింతలు, విశేషాలు, కబుర్లుంటాయని, విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూర్యోదయ స్కూల్ ఉపాధ్యాయుడు ధర్మారావు, గ్రంథాలయం పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.

## బాడీ బిల్డింగ్ పోటీల్లో బాలిగాం యువకుడు బ్రహ్మ ప్రతిభ



**మందస, ఏప్రిల్ 28(వార్త):** మందస మండలంలోని బాలిగాం గ్రామం చెందిన వమరవెల్లి బ్రహ్మ బాడీ బిల్డింగ్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచారు. విజయవాడ జగ్గయ్యపేటలో జరిగిన బాడీ బిల్డింగ్ కాంపిటీషన్-2025లో 85వ కేటగిరిలో రెండవ స్థానంలో నిలిచారు. సిల్వర్ టైటిల్ తో పాటు 2,500 నగదు బహుమతి కూడా గెలుచుకున్నారు. ఈ సందర్భంగా బాడీ బిల్డింగ్ జిల్లా కార్యదర్శి విజయ్ ప్రసాద్, గౌరీశంకర్లతో పలువురు కోచ్ లు బ్రహ్మను అభినందించారు. విశ్వబ్రాహ్మణ కుటుంబ నేపథ్యం అయినప్పటికీ ఒకవైపు కుటుంబాన్ని పోషిస్తూ, అత్యంత అరుదైన బాడీ బిల్డింగ్ విద్యని నేర్చుకుంటూ, తనదైన శైలిలో పోటీల్లో పాల్గొని బాలిగాం గ్రామానికి, శ్రీకాకుళం జిల్లాకు మంచి పేరు తీసుకు వచ్చారని స్థానికులు అభినందించారు. గ్రామస్తులు, స్నేహితుల సహకారంతో బ్రహ్మ బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొంటున్నారు. దాతలు ఆర్థికంగా కొంతవరకు సహకరిస్తే జాతీయ, అంతర్జాతీయ పోటీలలో బ్రహ్మ పాల్గొని మరిన్ని విజయాలు సాధిస్తారని స్థానికులు పేర్కొంటున్నారు.

## నాటుసారా'పై ఎక్సైజ్ పోలీసు దాడులు

**మందస, ఏప్రిల్ 28(వార్త):** నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలపై ఎక్సైజ్ శాఖ దాడులు కొనసాగిస్తోంది. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సోంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.బేబి ఆధ్వర్యంలో మారుమూల, గిరిజన, మైదాన, పల్లపు, ఉద్దాన ప్రాంతాల్లో కూడా నాటుసారాపై గాలింపు చర్యలు చేపడుతున్నారు. డ్రమ్ముల్లో ఉంచి భూమిలో పాతిపెట్టిన సారా నిల్వలు గుర్తించి, వెలికి తీస్తున్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా పలు స్టేషన్ల ఎక్సైజ్, పోలీసు అధికారులు సమన్వయంతో దాడులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం కూడా దాడులు నిర్వహించారు. మందస మండలంలోని పట్టులోగాం ప్రాంతంలో దాడులు నిర్వహించి, 400 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేస్తున్న 8 పొయ్యిలను కూడా ధ్వంసం చేశారు. 80లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, మందస మండలానికి చెందిన ఎస్.రాము, ఎస్.కొమండె, డి.కేశబో అరెస్ట్ చేశామని సీఐ బేబీ చెప్పారు. జె.చంద్రశేఖర్, లక్ష్మణను ఈ కేసుల్లో ఇన్వాల్వ్ చేయడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో సోంపేట, ఇచ్ఛాపురం ఎక్సైజ్ శాఖ అధికారులు ఎన్ ఫోర్స్ మెంట్ శ్రీనివాస రావు, మొబైల్ సీఐ జి.వి.రమణ, ఇచ్ఛాపురం సిఐ పీడీ ప్రసాద్, ఎన్ ఫోర్స్ మెంట్ ఎస్ఐ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.



# నగరవనంతో పర్యావరణ పరిరక్షణ

### స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే శంకర్

**గార, ఏప్రిల్ 28(వార్త):** జిల్లాలో వనాలను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడవచ్చు అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు పిలుపుమేరకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గోండు శంకర్ నగరవనం ఏర్పాటుకు సోమవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా గార మండలం ఎస్బి మత్స్య లేశంలో అటవీ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా విశాఖ ఏ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి అటవీశాఖ అధికారులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం నగర వనాలపై చర్చించి అటవీ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే శ్రీకూర్మంబిమత్స్యలేశం ప్రాంతంలో పర్యటించారు. నగర వనాలా అభివృద్ధి ద్వారా పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో తోడ్పడుతుంది అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నగరవనాలు పూర్తిగా కల కోల్పోయిందని, వాటిని



తిరిగి పునరుద్ధరించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని వివరించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా అటవీ శాఖ అధికారి, అటవీ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.



# నేర నియంత్రణకు డ్రోన్ నిఘా

**శ్రీకాకుళం, ఏప్రిల్ 28(వార్త):** డ్రోన్ నిఘా ద్వారా శ్రీకాకుళం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వాంబే కోలని, డచ్ బంగ్లా ,పొన్నాడ వంతేన తదితర నాగావళి నది పరివాహక ప్రాంతాలు, పట్టణ చివర ప్రాంతాలలో జిల్లా ఎస్పీ కవీ మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం,పేకాట, ఈవిటిజింగ్, చైన్ స్నాచింగ్, పేకాట, జూదం తడితర నేరాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. పాడుపడిపోయిన బంగ్లాలు, నివాస గృహాలపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి సేవించడం వంటి వారు పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మద్యం సేవించడం,గంజాయి వినియోగం చేసిన, పేకాట ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని జిల్లా ఎస్పీ తెలిపారు. పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాల నిర్వహణ, ఈవ్ టీజింగ్, ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపట్టడం జరుగుతుంది.

# శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ





**శ్రీకాకుళం, ఏప్రిల్ 28(వార్త):** శక్తి యాప్‌తోనే మహిళలు, విద్యార్థులకు భద్రత, రక్షణ లభిస్తుందని ప్రతి ఒక్క మహిళ, విద్యార్థులు ఫోన్ లో శక్తి యాప్ డౌన్లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శక్తి టీమ్ సభ్యులు శక్తి యాప్ ప్రాధాన్యత ఆవశ్యకత గురించి పాఠశాల, కలశాల,పబ్లిక్ ప్రదేశాలలో మహిళలకు, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం శక్తి బృందాల సిబ్బంది కలశాలలు, రైల్వే స్టేషన్లో, బస్టాండ్, ఇతర పబ్లిక్ ప్రదేశాలు, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు,విద్యార్థులకు శక్తి యాప్ ఆవశ్యకత ప్రాధాన్యత ప్రయోజనాలు ఉపయోగాలు గురించి విస్తృత స్థాయిలో అవగాహన కల్పించి ప్రతి ఒక్క మహిళ ఫోన్లో శక్తి యాప్ ను నిక్షిప్తం చేసుకొని ఆపద సమయంలో శక్తి యాప్ ద్వారా పోలీస్ వారు తక్షణ సహాయం పొందాలని సూచించారు.

డయల్ 112, ఎస్ఓఎస్ బటన్ ఆపద సమయంలో ఉప యోగించుకోవచ్చని, శక్తి యాప్ ద్వారా లభిస్తున్న సేవలు, పోలీసు వారిని సంప్రదించాల్సిన వివరాలు ఉంటాయని క్షుణ్ణంగా తెలిపారు.

# ఆస్తి పన్ను బకాయిలు చెల్లించండి

**శ్రీకాకుళం, ఏప్రిల్ 28(వార్త):** శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో గల గృహ యజమానులు మరియు వాణిజ్య సముదాయ యజమానులు 2024-25 ఆర్థిక సంవత్సరం నకు చెల్లించవలసిన ఆస్తి పన్ను బకాయిల వడ్డీ పై ప్రభుత్వం వారు ఇచ్చిన 50 శాతం రాయితీ 2025-26 ఆర్థిక సంవత్సరంకు చెల్లించవలసిన ఆస్తి పన్ను బకాయిలు, కొళాయి పన్ను బకాయిలు, ఖాళీ జాగా పన్ను బకాయిలు చెల్లింపు పై 5% రిబేటు ఈ నెల 30తో ముగియనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరం నకు చెల్లించవలసిన ఆస్తి పన్నులు, ఖాళీ జాగా పన్ను బకాయిలు చెల్లింపు పై మే నెల నుంచి అదనంగా 2శాతం వడ్డీ విధించబడును. కావున ప్రభుత్వం వారు ఇచ్చిన సదవకాశాన్ని ప్రజలు వినియోగించికోవలసిందిగా కోరుతూ, నగరపాలక సంస్థ కార్యాలయం యందు మరియు హడ్కో కాలనీ, గొంటి వీధి, చౌదరి సత్యనారాయణ కాలనీ, కిల్లిపాలెం-1, కిల్లిపాలెం-2 సచివాలయాల యందు కూడా ప్రత్యేక కౌంటర్లు




ఏర్పాటు చేయడం జరిగినది కావున నగర ప్రజలు మీ యొక్క పన్ను బకాయిలను నగరపాలక సంస్థ నందు చెల్లింపు చేయవలసిందిగా పుర ప్రజలను కోరుతూ ఈరోజు సాయత్రం నగరపాలక సంస్థ క్లాప్ వెహికల్స్ ద్వారా పబ్లిసిటీ చేయుటకు కమిషనర్ వారు జెండాతో ప్రారంభించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546